క్లుప్తంగా

డ్రైన్ పనులకు శంకుస్థాపన



కామనగరువులో డ్రైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అరుణకుమారి

అమలాపురం రూరల్: మండలంలో కామనగరువు పంచాయతీ జంగంపాలెంలో డ్రైన్ నిర్మాణ పనులకు సర్పంచ్ నక్కా అరుణ కుమారి ఆదివారం శంకుస్థాపన చేశారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సర్పంచ్ సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చంద్రశేఖర్, బొల్లంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మూర్తి

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంకలో ఆదివారం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం వాకర్స్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రోహిణి హాస్పటల్ డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నపిల్లల ఆరోగ్యం అవగాహన కల్పించారు. పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర రావు, పీస్ శర్మ, తేతల సత్యనారాయణరెడ్డి, పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, సెక్రటరీ వలవల నాయుడు, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు బమ్మిడిపాటి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ వీరబాబు, ఎస్సై కిషోర్‌బాబు

అమలాపురం టౌన్: విద్యార్థులు సైబర్ నేరాలపై చైతన్యవంతులై నిరక్షరాస్యులకు అవగాహన కల్పించాలని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. స్థానిక వడ్డిగూడెంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో విద్యార్థినలకు ఆదివారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు సైబర్ నేరాలతో పాటు రోడ్డు ప్రమదాలపై అవగాహన కల్పించారు. పట్టణ ఎస్సై కిషోర్‌బాబు మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రతి విద్యార్థిని 112 నంబర్‌కు కాల్ చేసి పోలీసు రక్షణ, సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 39 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మొత్తం రూ.30.64 లక్షలు మంజూరయ్యాయి. ఆయా చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, వాడ్రేవు వీరబాబు, అర్ధాని శ్రీను, చెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు సాధారణ నిధులే గత్యంతరమా..?

- వాటి నుంచే రూ.20 లక్షల చెల్లింపు
- చెత్త పన్ను ఎత్తివేత పర్యవసానం
- సాధారణ నిధుల నుంచి చెల్లించడంపై పాలక పక్షం అభ్యంతరం



అమలాపురం మున్సిపాలిటీలో ఇంటింటా చెత్త సేకరణలో భాగస్వామ్యం అవుతున్న 12 ఆటో టిప్పర్లు

అమలాపురం టౌన్: మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలటీల్లో అప్పటిదాకా అమలవుతున్న చెత్త సేకరణపై పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో దాని పర్యవసానంగా ఆయా స్థానిక సంస్థల సాధారణ నిధులపై భారం పడుతోంది. గత ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరణకు శ్రీకారం చుట్టి చిన్న చిన్న వీధుల్లోకి సైతం సునాయాసంగా వెళ్లే ఆటో టిప్పర్లను క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్) మంజూరు చేసింది. స్వయంభూ అనే ఏజెన్సీ సంస్థ ద్వారా ప్రజలపై నామ మాత్రంగా విధించిన చెత్త పన్ను నగర, పట్టణాల్లో వసూలుకు బాధ్యత అప్పగించింది. చెత్త పన్ను ఎత్తివేశాక అమలాపురం మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.20 లక్షలు నిధులు చెల్లించడంపై ముఖ్యంగా పాలక పక్షం నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న సాధారణ నిధుల లభ్యతపై ఇప్పుడు తాజాగా ఆ నిధుల నుంచి రూ.20 లక్షలు వెచ్చించడం ఆర్థికంగా మరింత ఇబ్బంది పెట్టడమేనని, ప్రభుత్వ విధానంపై పాలక పాక్షం మండి పడుతోంది. ఇలానే చెత్త సేకరణకు సాధారణ నిధులు నుంచి ఇవ్వడమంటే మున్సిపాలిటీ సంక్షోభంలో పడిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆటో టిప్పరుకు నెలకు రూ.53,250 చెల్లించాలి అమలాపురం మున్సిపాలిటీకి క్లాప్ ద్వారా 12 ఆటో టిప్పర్లు మంజూరయ్యాయి. ఆ టిప్పర్లు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తుంది. ఇందుకోసం పట్టణంలోని దాదాపు 13,500 ఇళ్లకు చెత్త వర్గీకరణ కోసం 3 టిన్నులను కూడా పంపిణీ చేసింది. ప్రతి ఇంటికీ చెత్త సేకరించినందుకు ‘క్లాప్’ ఆదేశాల మేరకు నెలకు రూ.50 స్వల్ప రుసుము వసూలు చేస్తోంది. ఈ మున్సిపాలిటీకి చెత్త పన్ను వసూలు లక్ష్యం నెలకు రూ.6.39 లక్షలు. అంటే టిప్పర్లు ఇచ్చినందుకు ఒక్కో టిప్పర్‌కు రూ.53,250 ఆ ఏజెన్సీకి చెల్లించాల్సి ఉంది. మున్సిపాలిటీ ప్రతి నెలా రూ.5 లక్షల దాకా చెత్త పన్ను వసూలు చేసి స్వయం భూ ఏజెన్సీకి చెల్లిస్తోంది. కొన్ని నెలల్లో లక్ష్యానికి అనుగుణంగా నూరు శాతం వసూలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

చెత్తపన్నుపై కూటమి నేతల రాద్ధాంతం

ఎన్నికలకు ముందు నగరాలు, పట్టణాల్లో వసూలు చేస్తున్న స్వల్ప చెత్త పన్నుపై కూటమి పార్టీల నేతలు తరుచూ రాద్ధాంతం చేసి చివరకు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పన్ను ఎత్తి వేశారు. చెత్త సేకరణకు వేసిన స్వల్ప పన్నుపై ప్రజల నుంచి వ్యతిరేకత రాకపోయినప్పటికీ ఆయా వార్డుల్లో ఉండే కూటమి పార్టీల నాయకులు చెత్త పన్నును ఆది నుంచి వ్యతిరేకించి రద్దును కోరారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ అనేది గత ప్రభుత్వం తీసుకున్న ఆదర్శ నిర్ణయాన్ని మెజార్టీ ప్రజలు స్వాగతించారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం చెత్త పన్నును ఎత్తి వేసింది గాని ఇంటింటా చెత్త సేకరణకు చరమ గీతం పాడలేకపోయింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని ఎత్తివేసే ఆలోచనలో ఉన్నా ప్రజలకు చేరువైన ఈ పద్ధతి జోలికి వెళ్లేందుకు పునరాలోచిస్తోంది.



అమలాపురంలో ఇంటింటికీ ఆటో టిప్పర్‌ను తీసుకువెళ్లి చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది

నాలుగు నెలలుగా జీతాల్లేవు

చెత్త పన్నును ఎత్తివేసిన ప్రభుత్వం ఆటో, టిప్పర్ల డ్రైవర్లకు గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఇంటింటా చెత్త సేకరణ విధానాన్ని ఉంచాలా..? తీసేయేలా.. అనే దానిపై నిర్ణయం తీసుకునేందుకు పునరాలోచనలో పడిందని తెలిసింది. టిప్పర్ల డ్రైవర్లు తమ జీతాల కోసం నిరసన బాట పట్టినా ప్రభుత్వం ఈ టిప్పర్ల విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేకపోతోంది.

గత జూన్ వరకూ బకాయిలు చెల్లించాం



మున్సిపాలిటీలో ఇంటింటా చెత్తను సేకరిస్తున్న 12 టిప్పర్లకు సంబంధిత ఏజెన్సీకు గత జూన్ నెల వరకూ బకాయిలు క్లియర్ చేశామని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. పట్టణంలో చెత్త పన్ను వసూలు చేయడం లేదని పేర్కొన్నారు. మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.20 లక్షల బకాయిలు చెల్లించే ఏర్పాటు చేశాం.

– **రాజు, మున్సిపల్ కమిషనర్**, అమలాపురం

21న ఓఎన్జీసీ పరిహారం పంపిణీ

ఐ.పోలవరం: ఓఎన్జీసీ కార్యకలాపాలతో నష్టపోతున్న జిల్లాలోని మత్స్యకారులకు పరిహారం అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న పరిహారం అందజేయనున్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.63,943 చొప్పున లబ్ధి చేకూరనుంది. జిల్లా మొత్తం 23,458 మందికి రూ.149.99 కోట్లను అందజేయనున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 20,878 మంది మత్స్యకారులకు రూ.133.50 కోట్ల వరకూ చెల్లించనున్నారు. ఆ రోజు ఓఎన్జీసీ సంస్థ ప్రతినిధులతో పాటు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పాల్గొంటారని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆదివారం తెలిపారు.

రేషన్ దుకాణాలు తెరవాలంటూ ధర్నా

యానాం: రేషన్ దుకాణాల ద్వారా ఉచిత బియ్యం, పంచదార తదితర నిత్యావసరాలు పంపిణీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం హామీ నిలబెట్టుకోలేదని నిరసిస్తూ ఆదివారం ఏఐఏడీఎంకే నేత అన్నళగన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీపావళికి నిత్యావసరాలను మూతపడ్డ రేషన్ దుకాణాలను తెరిచి వాటి ద్వారా అందిస్తామని సీఎం రంగసామి ప్రకటించారని సుమారు 20 నియోజకవర్గాల్లో ఇప్పటికీ రేషన్ దుకాణాలు తెరవక పోవడంతో రేషన్‌కార్డు దారులు నిరాశతో వెనుదిరిగారన్నారు. ప్రజలను మోసం చేయకుండా తక్షణం ఉచిత బియ్యం, పంచదారను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పరిశోధనలకు ఊతం ‘అమరజ్యోతి అంబేడ్కర్’

- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ బాబ్జి
- యానాంలో పుస్తకం ఆవిష్కరణ
- రచయిత విష్ణుమూర్తికి సత్కారం



అమరజ్యోతి అంబేద్కర్ పుస్తకావిష్కరణ వేడుకలో బాబ్జి, ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారి పరిశోధనలకు కలైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి రచించిన అమరజ్యోతి అంబేడ్కర్ గ్రంథం ఎంతగానో ఉపకరిస్తుందని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ అన్నారు. అమరజ్యోతి అంబేడ్కర్ గ్రంధావిష్కరణ సభ ఆదివారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన భవన్‌లో జరిగింది. కార్యక్రమానికి ప్రముఖకవి దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ పొనుగుమట్ల విష్ణుమూర్తి ఐదేళ్ల పాటు పరిశోధన సాగించి అమరజ్యోతి అంబేడ్కర్ పుస్తకాన్ని రచించడం మహాద్భుతం అన్నారు. తొలి ప్రతిని అందుకున్న ఆర్‌ఏఓ మునిస్వామి మాట్లాడుతూ వృద్ధుడైనప్పటికీ విష్ణుమూర్తి తనకు అంబేడ్కర్‌పై ఉన్న ఆసక్తితో నూతన పంథాలో గ్రంథ రచన చేశారన్నారు. విద్యార్థులకు ఉపకరించే విధంగా అన్ని లైబ్రరీల్లో సమాచార శాఖ ఈ పుస్తకాన్ని ఉంచనున్నట్లు ప్రకటించారు. అనంతరం గ్రంథ రచయిత పొనుగుమట్ల విష్ణుమూర్తిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా కథా రచయిత పెనుమాక రత్నాకర్‌ను కూడా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌ఏఓ నామాడి అప్పారావు, బౌద్ధ పరిశోధకుడు పిల్లి రాంబాబు, మాజీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ మోకా పావన్‌కుమార్, బుద్ధవిహార్ అధ్యక్షుడు డాక్టర్ భానుమతి, సాహిత్యకారుడు ముంగండ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన వీరేశ్వరుని ఆలయం



విద్యుత్ దీపాలంకరణలో మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం

ఐ.పోలవరం: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని మురమళ్లలోని వీరేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. కార్తిక తొలి సోమవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున రానున్నారు. ఇక్కడ స్వామి వారికి కల్యాణం చేస్తే పెళ్లికాని వారికి పెళ్లి అవుతోందని భక్తుల నమ్మకం. ఇందుకు తగినట్టుగా ఆలయంలో కార్తిక మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం అధికారులు సన్నాహాలు చేశారు. పర్వదినాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉన్నందున ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో రూ.మూడు వేలు చెల్లిస్తే నెల రోజులు స్వామివారి నిజరూప లింగానికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయాధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి సుభాష్‌కు వినతి పత్రం అందించిన జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు అమలాపురంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆదివారం కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. 50 ఏళ్లు దాటిన కార్పెంటర్లకు ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కార్పెంటర్లు సుభాష్‌ను స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిశారు. కార్పెంటర్ల సంఘం కార్యాలయం సొంత భవనానికి స్థలం కేటాయించాలని మంత్రిని కోరారు. విశ్వ కర్మ యోజనలో జిల్లా చేతి వృత్తుల వారికి శిక్షణా తరగుతులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమ శంకరం, ఉపాధ్యక్షుడు కొనుకు వెంకటేశ్వరరావు, కుసుమే నరసింహారావు, పితాని బేబీరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపానికి అధికారులే కారణం

హెచ్‌ఆర్ స్క్వేర్ కార్మికుల ఆరోపణ

యానాం: ఎనిమిది నెలల జీతాలు బకాయి పడినందునే తాము పారిశుధ్య విధులను నిలిపి వేశామని యానాం పట్టణ పారిశుధ్య కార్మికులు స్పష్టం చేశారు. పట్టణంలో పరిశుభ్రత లోపించడానికి మున్సిపల్ అధికారులే కారణమని వారు ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. యానాంలో పారిశుధ్య పనులు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు నిర్వహణకు హెచ్‌ఆర్ స్క్వేర్ అనే సంస్థతో 15 ఏళ్ల పాటు పుదుచ్చేరి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. హెచ్‌ఆర్ స్క్వేర్ సంస్థ కార్మికులుగా 140 మంది యానాం మున్సిపాలిటీ పరిధిలో ఈ విధులు నిర్వహిస్తున్నారు. కాని ఏదో విధంగా హెచ్‌ఆర్ స్క్వేర్ సంస్థను తప్పించి పూర్వపు సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించాలనే కుయుక్తితో ఈ సంస్థకు బిల్లులు రాకుండా అధికారులు అడ్డుపడుతున్నారని పారిశుధ్య కార్మికులు ఆరోపించారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులే రాజకీయాలు చేయడం ఎంతవరకూ సబబు అని వారు ప్రశ్నించారు. తాము విధులు బహిష్కరించడానికి, పట్టణంలో పారిశుధ్యం లోపించడానికి ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. తమకు వేతనాలు అందని విషయం తెలిసి మూడు నెలల పాటు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికీ 8 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని వారు చెప్పారు. రెక్కాడితే గాని డొక్కాడని విధిలేని పరిస్థితిలో తాము పారిశుధ్య పనులకు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, ఫణీంద్ర, కృష్ణప్రసాద్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోవర్ధన గిరి పూజా మహోత్సవం



శ్రీకృష్ణ లీలలపై ప్రవచనం చెబుతున్న ఇస్కాన్ చైర్మన్ శివానంద నిమయి దాస్

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక రావులచెరువు వద్ద గల ఇస్కాన్ అవుట్ లెట్ కేంద్రంలో గోవర్ధన గిరి పూజా మహోత్సవం ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. అన్న కూటంతో గోవర్ధన పర్వతాన్ని తయారు చేసి పూజలు చేశారు. ఆ అన్నకూటం చుట్టూ తిరిగి గిరిప్రదక్షిణం చేస్తున్నట్లుగా శ్రీకృష్ణ కీర్తనలు గావించారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ టీఎంసీ చైర్మన్, అమలాపురం అవుట్ లెట్ కేంద్రం ఇన్‌చార్జి శివానంద నిమయి దాస్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. శ్రీకృష్ణుడు తన ఎడమ చేతి చిటికెన వేలితో గోవర్ధన పర్వతాన్ని 7 రోజులపాటు ఎత్తి పట్టుకుని బృందావన వాసులందరికీ రక్షణ కల్పించిన ఘట్టాన్ని వివరించారు. అనంతరం శ్రీకృష్ణుని లీలలపై ప్రవచనం చేశారు. అఖండ హరినామ కీర్తనలు వినిపించారు. చివరగా ప్రసాద వితరణ చేశారు. సామాజిక సేవకుడు గొవ్వాల అచ్యుతరామయ్య, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బేతాళ స్వామి ఉత్సవాలకు శ్రీకారం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పంచాయతీ బడుగువారిపేటలో ఈ నెల 16న జరిగే బేతాళస్వామి చెడీ తాలింఖాన ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ నక్కా అరుణకుమారి, చంద్రశేఖర్ దంపతులు బేతాళ స్వామి వారికి పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి చెడీ తాలింఖాన విన్యాసాలు నిర్వహించారు.

ఇసుక లారీ సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీ

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలించేందుకు ప్రయత్నించిన లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.రాము తెలిపారు. లారీని పేరవరంలో సీజ్ చేసి ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. గ్రామాల్లో అనధికారికంగా ఎక్కడైనా ఇసుక తవ్వకాలు జరిగితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

17న శెట్టిబలిజ కార్తిక వన సమారాధన



వనసమారాధన కరపత్రాలను విడుదల చేస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

అమలాపురం టౌన్: కోనసీమ శెట్టిబలిజ కార్తిక వన సమారాధనను ఈ నెల 17న అమలాపురంలోని వాసర్ల గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు వనసమారాధన ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి తెలిపారు. వన సమారాధన నిర్వహణపై స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో ఆదివారం సన్నాహక సమావేశంలో నిర్వహించారు. కోనసీమ శెట్టిబలిజ సంఘం నేతలు వన సమారాధన కర పత్రాలను ఆవిష్కరించారు. శెట్టిబలిజలందరూ వన సమారాధనకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోనసీమ శెట్టిబలిజ సంఘం నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఇళ్ల శేషగిరిరావు, మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, గొవ్వాల రాజేష్, వాసంశెట్టి తాతాజీ, విత్తనాల ఇంద్ర శేఖర్, కుడుపూడి భరత్ భూషణ్, దంగేటి రుద్ర, దొమ్మేటి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



నాలుగు దిక్కులా వలలు విసురుతున్న మత్స్యకారులు

ఉప్పలగుప్తం: వేటకు వెళ్తే కాని పూట గడవని జీవితం మత్స్యకారులది. నిత్యం పలు రకాల విధానాల్లో వేటను సాగిస్తుంటారు. ఈ తరుణంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటారు. కాగా ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల సరిహద్దు ప్రాంతంలో సముద్రంలో నది కలిసే చోట మత్స్యకారులు నాలుగు దిక్కులా వలలు విసిరి చేపల వేటను సాగించడం చూపరులను ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని ‘సాక్షి’ తన కెమెరాలో బంధించింది.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలేవీ ?

- ఆధునీకరణకు నోచుకోని దరియాలతిప్ప తాగునీటి పథకం
- అపరిశుభ్రంగా చెరువు పరిసరాలు
- చెరువులో పేరుకపోయిన పూడిక



పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న దరియాల తిప్ప రక్షితమంచినీటి చెరువు



రక్షితమంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు

యానాం: తీర గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే దరియాలతిప్ప రక్షితమంచి నీటి పథకం ఏళ్లతరబడి ఆధునీకరణకు నోచుకోవడం లేదు. మంచినీటి చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, చెరువులో పూడిక పేరుకుపోవడంతో ఈ చెరువు నీటిని తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

నియోజకవర్గంలో...

దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకం ద్వారా నియోజకవర్గానికి శివారున ఉన్న తీరగ్రామాలైన సావిత్రి నగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట, పరంపేట గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతోంది. ఈ చెరువును ఆధునీకరించక పోవడంతో అపరిశుభ్రం నెలకొంది. చెరువు పరిసరాలు పిచ్చిమొక్కలతో దర్శనం ఇస్తున్నాయని, నాచుపట్టి నీరు కలుషితమవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ రివిట్‌మెంట్ ఇప్పటివరకు చేయకపోవడంతో పరిశుభ్రత లేకుండా పోయిందని చెబుతున్నారు.

24 సంవత్సరాల క్రితం నిర్మాణం.

దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని 20 సంవత్సరాల క్రితం నిర్మించారు. 1996లో దీని నిర్మాణం ప్రారంభం కాగా 1997లో పూర్తయ్యింది. దీనిని అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ రాజేంద్రకుమారి బాజ్‌పేయి ప్రారంభించారు. దీని ద్వారా 10 లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజూ ఆయా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఈ పథకం ద్వారా తీరగ్రామాలకు సరఫరా చేసే తాగునీరు కలుషితమై రంగు మారుతోంది. ముఖ్యంగా పత్తిగొంది సమీపంలోని ఫ్రెంచి కెనాల్ నుంచి కాలువ ద్వారా వచ్చేనీరు సైతం పూడికతో ఉంటోంది. ఆ నీటిని రక్షిత మంచి నీటి పథకం వద్ద శుభ్రం చేసి ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎల్జీకు ఫిర్యాదు

తీర గ్రామాల్లోని వేలాది మందికి తాగునీరు అందించే దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని ఆధునీకరించాలని లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష నాథన్‌కు ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రం అందించారు. ఆయన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

అనారోగ్యం బారిన పడుతున్నాం



దరియాలతిప్ప రక్షిత మంచి నీటి పథకాన్ని ఆధునీకరించాలి. చెరువులో పూడిక తీయక పోవడంతో నీళ్లు రంగు మారుతున్నాయి. కలుషిత నీటిని తాగడంతో అనారోగ్యం బారిన పడుతున్నాం. ప్రభుత్వం చేయకపోతే చెరువును గ్రామస్తులకు అప్పగిస్తే బాగు చేసుకుంటాం

సబ్బతి శ్రీనివాసరావు,
గ్రామ పెద్ద, దరియాలతిప్ప

ఆ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుంది

- క్షత్రియ వనసమారాధనలో కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ



జి.వేమవరం వనసమారాధనలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

తాళ్లరేవు: ఎటువంటి ఆర్థికబలం లేని తనకు ఎంపీ టికెట్ ఇవ్వడంతో పాటు పార్టీకి చేసిన సేవలను గుర్తించి కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించిన ఘనత భారత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మండల పరిధిలోని జి.వేమవరంలో ఆదివారం కాకినాడ క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్షత్రియ కార్తిక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షత్రియులు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ, సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ సేవా దృక్పథానికి మారుపేరు క్షత్రియులు అన్నారు. నీతి, నిజాయితీతో ధైర్యంగా ప్రజలకు సేవచేయాలని కోరారు. అనంతరం అల్లూరి సీతారామరాజు, విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో నిర్మించిన ఏఎస్ఆర్ సేవా సదన్ భవనాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు కనుమూరి రఘురామకృష్ణంరాజు, పత్సమట్ల ధర్మరాజు, పూసపాటి అదితి, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కేవీవీ సత్యనారాయణరాజు, రుద్రరాజు పద్మరాజు, నడింపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ టీమ్‌కు సత్యరామ్‌పాల్

మామిడికుదురు: ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ క్రికెట్ టీమ్‌కు మామిడికుదురుకు చెందిన మట్టా సత్యరామ్‌పాల్ ఎంపికయ్యారు. నగరం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రామ్‌పాల్‌ను జిల్లా జట్టుకు ఎంపిక చేశారని క్రికెట్ కోచ్ మట్టా సత్తిబాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి అమలాపురంలో జరిగే స్టేట్ మీట్‌లో కోనసీమ జిల్లా జట్టు 12 జిల్లాల జట్లతో తలపడుతుందన్నారు. జిల్లా టీమ్‌కు ఎంపికైన రామ్‌పాల్‌ను స్కూల్ ఉపాధ్యాయులు, స్థానికులు, క్రీడాభిమానులు అభినందించారు.